# పబ్లిసిటీ

నాగళ్లభైరవ ఆంజనేయులు



ప్రముఖ చలనచిత్ర కథానాయిక రంగశ్రీ హాల్లో చిరాగ్గా పచార్లు చేస్తోంది. ఆమె ఒళ్ళు భగభగ మండిపోతుంది. మనసు కుత కుత వుడికి పోతోంది. గత పదేళ్ళుగా అటు తమిళ ప్రాంతం లోనూ, ఇటు ఆంధ్రదేశంలోనూ ప్రేక్షకుల మనసుల్ని చూరగొని, వారి ఆదరాభిమానాల్ని మిన్నగా పొంది వెండితెరపై దేదీప్యమానంగా వెలిగిన రంగశ్రీని గురించి గత నెలరోజులుగా ఏ సినిమా పత్రికలోనూ ప్రముఖంగా వ్రాయలేదు. తన తర్వాత పరిశ్రమలో జొరబడినవారిని గురించి ఎంతో పొగుడుతున్నారు. అదే సహించలేకపోతుంది రంగశ్రీ.

అసలే ప్రేక్షకులు గొర్రెలమంద. ఒట్టి పిచ్చిమాలోకం. ఎంతగా అభిమానించే తారయినా కొన్నిరోజులు తెరపై కనబడకపోతే, ఆ తారను గురించి ఏ పత్రికా పొగుడుతూ వ్రాయకపోతే అభిమానులు ఆ తారమీద దురభిమానాన్ని పెంచుకుంటారు. ఆ తారకు 'డిమాండ్' తగ్గిందని అంచనా వేస్తారు. గ్లామర్ లేదని భావిస్తారు. ఆ తార నటించిన సినిమా విడుదలయినా పెద్దగా ఆర్భాటం చేయదు.

రంగశ్రీకి గాభరాగా వుంది. తనకి డిమాండ్ తగ్గిపోతుందేమో! బుకింగులు రావేమో! ఎలాగయినాసరే అన్ని సినిమా పత్రికలూ తన గురించి ప్రముఖంగా వ్రాసేటట్లు చేయాలి.

అంతలో సెక్రటరీ గుమ్మంలో నిలబడి కొద్దిగా ముందుకి వంగి చేతులు జోడించి "గుడ్‌మార్నింగ్ మాడమ్!" అన్నాడు వినయ విధేయతల్ని స్వరంలోనూ, ముఖంలోనూ రంగరిస్తూ.

రంగశ్రీ పచార్లు ఆపి సోఫాలో కూర్చుంది. సెక్రటరీ అప్పలస్వామి ఆమెకు దగ్గరగా వచ్చి కాస్త దూరంలో నిలబడ్డాడు.

"నీవు నిద్రపోతున్నావా?" రంగశ్రీ హుంకరించింది. అప్పలస్వామి కళ్ళు నులుముకొని చూశాడు. ఒళ్ళు గిల్లుకున్నాడు.

"లే... లేదు మాడమ్!"

"మరి పబ్లిసిటీ కోసమని ప్రతినెలా వేలకువేలు తగలేస్తున్నావే... ఆ విలేఖరులు నిద్రపోతున్నారా?" గద్దించి అడిగింది రంగశ్రీ.

అప్పలస్వామి తల గోక్కొని నిటారుగా నిలబడి "లేదు మాడమ్..." అన్నాడు.

"నా డబ్బులు తింటున్న ఆ కుక్కలు నాగురించి పత్రికల్లో ఎందుకు వ్రాయటంలేదు గత నెల రోజులుగా?"

"పోయిన వారం 'ధుమారం' పత్రికలో మీ న్యూస్ వేశారుకదా!" అప్పలస్వామి నసిగాడు.

"స్టుపిడ్ న్యూస్. ఎనిమిదో పేజీలో ఆరో కాలంలో నాలుగు లైన్లు వ్రాశారు. అదీ వార్తే. నో... మొదటి పేజీలో అన్ని కాలంలు నా గురించి వ్రాయాలి. అదీ న్యూసంటే."

"మరి... అలా వ్రాయాలంటే ఏదైనా విశేషం జరగాలి."

"అదే నేను అడుగుతున్నా అప్పలస్వామీ. అందర్నీ ఆకట్టుకునేలా మొదటి పేజీలో మనగురించి రావాలంటే ఏం చేయాలి" రంగశ్రీ కోపం కొంత కరిగిపోయింది.

"మీ ఇంట్లో దొంగలుపడి నగలు కాజేసినట్లు రిపోర్టిస్తే..." అప్పలస్వామి నవ్వుతూ చెప్పాడు.

రంగశ్రీ కోపంగా చూసింది. "ఇదే వార్త మొన్న గంపశ్రీ గురించి వేశారు. అందులో కొత్తేమీ లేదు."

అప్పలస్వామి మదురు అరచేతో

## సామాన్యుని సణుగుడు

# 'ప్యార్' అనగా ప్రేమ!

వాతావరణం గొప్ప చల్లగా వుంది — యిప్పుడో గడియో వాన పడవచ్చును... ప్రియుడు చేస్తున్న పని వదిలి ప్రియురాలికోసం పరిగెత్తుకు వచ్చాడు. ఆమె చీర తిరగేసి కట్టుకుందో, మరి ఎలా కట్టుకుందో... మాపు కన్పడకుండా కట్టుకుంది... స్నేహం పగ్గమై లాగగా వచ్చింది ఆ యిద్దరూ కలుసుకున్నది వాళ్ళ "బృందావనం" ఒక ఫుట్‌పాత్... ఫుట్‌పాత్ మీద నిలబడ్డ యీ జంటని ఎవ్వరూ గమనించరు... ఎలా గమనిస్తారు? చిరుగుల పంట్లాం — ఎరుపు కోటు — చింకి టోపీరాయుడు "హీరో" అని యెవడికి పడుతుంది?

ఆ యిద్దరూ అర్జంటుగా మాట్లాడేసుకున్నారు. స్నేహం అనే విత్తనం ఆ రెండు పేద గుండెల్లోను ప్రేమగా మొలకెత్తుతున్న ఛాయలు, మొహంలో కళ్లలో, వాళ్ళ చిరునవ్వుల్లో తొంగి చూస్తున్నది.

"టీ అబ్బీ" హీరోకి ఫ్రెండు ... చిన్న డబ్బా, దాని కింద కుంపటి దానికే తగిలించిన కప్పులు. బక్కెట్‌లో నీళ్ళు!

"చాయ్ తాగుతావా?" అడిగాడు హీరో.

గొప్పగా చూసింది హీరోయిన్ ... ప్రియుడు యిప్పించే టీ యెలా కాదంటుంది...

స్పెషల్ టీ చెప్పటంకోసమా అన్నట్లు హీరో "చాయ్‌వాలా" చెవులు కొరికాడు.

"ఈసారిమాత్రం అప్పు యివ్వను ... రొక్కం కొట్టాలి" అన్నాడు చాయ్‌వాలా.

హీరో రాజు వొప్పుకున్నాడు.

ఒహో!... ఆ వాతావరణంలో వేడివేడిగా రెండు కప్పులు అక్కడే ఫుట్‌పాత్ మీద కూర్చుని సేవిస్తూంటే యెంత మజాగా వుంది...

దొంగచూపుల మత్తులో వేడి వేడి "టీ" గమ్మత్తుగా వు ది ... ఐపోయింది. ప్రేయసి — హీరోగారి ఆతిథ్యాన్ని అపురూపంగా స్వీకరించింది... టీ త్రాగేసింది ...

కాని హీరోగారికి గొంతులో పచ్చివెలక్కాయ పడ్డది ... చిల్లరలేదు ... అంటే టోకు వుందనా? 'చాయ్‌వాలా' మొహమంతా మీసాలు చేసుకుని చూస్తున్నాడు.

భయపడ్డాడు హీరో, కాని భంగపడటం యిష్టంలేదు ... కాని యెట్లా?

"ఇదిగ్గో చిల్లర పావలాకాసుందా?"

అమ్మాయిగార్నడిగాడు వందరూపాయల నోట్లు మాత్రం చింకి జేబులనిండా వున్నట్లు కేవలం చిల్లర పావలాకాసు మాత్రం లేనట్లు — అడిగాడు.

దీనమైన దృశ్యమా? యిది కాదు...దీనికైన సన్నివేశం అది...

అదృష్టవశాత్తు ఆమె స్నేహితుడి దగ్గరికి పోతూ పుట్టె చేతులతోనా? పోవడం అన్నట్లు చిల్లర "మానేజీ" చేసుకొచ్చింది.

నవ్వుతూ యిచ్చింది... ఆ నవ్వులో—ఏముందో అనక చెప్తాను.

హీరో ఆ పావలా కాసు చాయ్‌వాలా కిచ్చేశాడు. మేఘాలు గర్జించాయి... వర్షించాయి ఆ వానలో ఎదలోపల పెరిగే వెచ్చని ప్రేమలో "ప్యార్‌హువా" హీరోయిన్ హీరోలు అలాగే తడుస్తూ... "ప్యార్ హువా యిక్ రార్‌హువా..." అంటూ పాడుకుంటూంటే... ఆ ప్రేయసి నవ్విన నవ్వులో ఆ విశాలమైన నోరు యిప్పినప్పుడు పలువరున మల్లెపూల్లా మెరిసి — సినిమా కవులంతా తల్లక్రిందులా యిద్దై కూడా రాయలేని రెండర్థాల డైలాగులు కొన్ని వందలు తళుక్కుమన్నాయి — ప్రేమ, జాలి, ఆదరణ, ఆకర్షణ విశ్వాసం యిన్ని భావాలను కామిరా క్లోజప్‌లో పట్టుకుంది.

ఈ సీను ఎక్కడిదో... యీపాటికి అందరూ "గెస్" చేసేవుంటారు. ఈ సన్నివేశం మన ఆధునిక నవలలోను — అప్టుడేట్ బైస్కోపులలోనిది కాదు. రాజకపూర్ తీసిన 'శ్రీ 420' సినిమాలోనిది.

ప్రేమ ఫుట్‌పాత్‌మీద చింకిగుడ్డల వాళ్లమధ్యా పావలాకి రెండు కప్పులు లభించే "చాయ్"లోను ఆవిర్భవిస్తుందా? ని అడుగుతున్నారా?

ఆ సన్నివేశ కల్పన చేసిన "సినిమా కారుడు" ఆ సీను చూసిన ఎవ్వరికీ ఆ సందేహం రానంత కళాత్మకంగా తీశాడు. ఏనాటి మాటో అది... ఆ రాజ్‌కపూర్ యీవాళ లేడు... "సంగమ్" సినిమాతోనే సున్నితమైన ప్రేమ సన్నివేశాలకతను స్వస్తి చెప్పాడు.

ఇలాంటివి మన కివాళ సినిమాల్లో దొరకవు. ఈ ప్రేమ కథల్లోను దొరకదు.

'మనసనేది' ఒకటుంది దాన్ని 'కామిరా' పట్టుకోవాలంటే — డైరక్టర్‌కి ఎంత తపస్సు కావాలి?

మన కథల్లోనే అయితే! తొలి చూపునుంచీ కూడా ఇలా "గర్భాదానవు" గది 'కళ' కారిపోవడమే తప్ప ...

మన సినిమాలైతే సరేసరి ... అమ్మమ్మ... మాట్లాడుకుంటే చాలు — హీరో హీరోయిన్లు— అన్నీ రెండర్థాలే — యిక పాడుకున్నవో సరేసరి!

హృదయం అనేది ఒక "పడగ్గది అర" ఒక "లాడ్జింగు హౌవుసు గది" — అదో కార్యం గది మంచం — లాంటిది సుమా? — అంతకన్నా ఆడదానికి మగాడికి మధ్య వుండే హృదయం ఏమిటి? ప్రేమ ఏమిటి? — నాన్‌సెన్సు ... "దోబదన్" అంటే రెండు శరీరాలు ముఖ్యం — "దో దిల్‌కా జమానా చలా గయా" — అంటే రెండు గుండెకాయ లొక్కటయ్యే రోజులు పోయాయి అన్నట్లుగా తయారైంది దేశవాళీ బైస్కోపు...

హృదయం — ఆరాధన విరహం—త్యాగంలాంటిదంతా సాబ్ సిస్టర్ స్టఫ్ అయిపోయింది...

ఏం చేస్తాం... ఎవరికోసం చూస్తాం...

గట్టిగా ఒకర్ని ఒకరు నలిపేసుకుంటూన్న సన్నివేశం చూపెడుతూనే, గుడ్డివాళ్లకోసమా? అన్నట్లు — మన సినిమా ప్రష్టలు — "నలిపేయి... చంపేయి... నీ కౌగిలిలో నన్ను యిది చేసై అది చేసై" అంటూ ఆరవై వాద్యాలతో బ్యాక్ గ్రౌండులో గోలకూడా చేస్తున్నారు. ఆరేళ్ల కూనకి పై సన్నివేశంలోని ఒక స్టిల్‌ని పత్రికలో పడ్డదాన్ని చూపెట్టి అడగండి — "యిదేమిటిబాబూ" అని టక్కున వాడంటాడు. 'ఇదే తెలీదా? వాళ్లిద్దరూ ప్రేమించుకుంటున్నారు' అని. అయ్యో అదీ ప్రేమ.

— వీరాజీ

## పబ్లిసిటీ

రుద్దుకున్నాడు. మెరుపులాటి ఆలోచన మెదిలింది.

"మేడమ్! ఈవిధంగా చేస్తే మీ పేరు ప్రేక్షకలోకంలో మారుమ్రోగుతుంది."

"ఏవిధంగా?" అన్నట్లు చూసింది రంగశ్రీ.

"మీరు మీ భర్తకు విడాకులిచ్చి మరో ప్రముఖ హీరోని పెళ్ళాడబోతున్నారని విలేఖరులకు చెబితే..."

"ఏడ్చినట్లే వుంది నీ బోడి ఐడియా! పోయిన నెల్లో విజయవాడలో జరిగిన పత్రికా గోష్టిలో 'నా శ్రీవారంటే నాకెంతో ప్రేమని, నాపతియే నాకు ప్రత్యక్ష దైవమని చెప్పాను.'

'పోనీ మేడమ్! మీ అబ్బాయిగారిని ఎవరో దొంగలు ఎత్తుకపోయారని చెబితే..."

"దాంతో పోలీస్ ఎంక్వయిరీ. అబ్బాయి ఖచ్చితమైన వయసు చెప్పక తప్పదు. అబ్బాయి అసలు వయసు తెలిస్తే నా అసలు వయసు బయట పడుతుంది. ఉన్న గ్లామర్‌కాస్తా ఊడ్చుకపోతుంది."

అప్పలస్వామి ఆలోచించి "మేడమ్! రేపు రోడ్డుమీద కారుకు ఏక్సిడెంట్ జరిగేలాచేద్దాం."

"ఇదేమన్నా సినిమా షూటింగా కారు ఏక్సిడెంట్ జరగటానికి! ట్రిక్ ఫొటోగ్రఫీ లేకుండా, డూప్ లేకుండా ఏక్సిడెంట్ జరిగితే నా కాలో చెయ్యో విరుగుతుంది. రాస్కెల్! యిలాంటి వెధవ ఆలోచనలు మాను. వారంరోజుల్లో ప్రముఖంగా పత్రికలన్నీ ప్రచురించే విధానం గురించి ఆలోచించు. లేదా నిన్ను డిస్మిస్ చేస్తాను." రంగశ్రీ అప్పలస్వామి మీద మండిపడింది.

అప్పలస్వామి తన అద్దె యింటికి వెళ్ళాడు. ఆలోచించాడు. మంగుళూరు బీడిలు కాల్చి కాల్చి మరీ ఆలోచించాడు. నాలుగోరోజు సాయంత్రానికి అప్పలస్వామికి బ్రహ్మాండమైన ఆలోచన తట్టింది. వెంటనే పబ్లిక్ ఫోన్ దగ్గరికి వెళ్ళి ఏదో నెంబర్ తిప్పి రహస్యం చెప్పినట్లు చెప్పాడు. యింటికి చేరి కడుపునిండా అన్నం తిని నిద్రపోయాడు.

అప్పలస్వామి చేసిన ఆ ఫోను ప్రభావంవల్ల మూడోరోజుకి సినిమా పత్రికలేకాదు ... ప్రముఖ దినపత్రిక లన్నీ కథానాయిక రంగశ్రీని గురించి మొట్టమొదటి పేజీలో ప్రముఖంగా వ్రాశాయి.

ప్రచురితమైన ఆ వార్త సారాంశం:

"గత రాత్రి ఆదాయపుపన్ను శాఖవారు ప్రముఖ కథానాయిక రంగశ్రీ ఇంటిపై మెరుపుదాడి జరిపారు. లెక్కలలో చూపించని నల్లధనం, బంగారపు నగలు, డాలర్లు మరెన్నో విదేశీ వస్తువులు బయటపడ్డాయి. వాటి విలువ ముప్ఫయి లక్షలకు పైనే వుంటుందని అంచనా. రంగశ్రీని అరెస్టు చేశారు."